క్లుప్తంగా

వెదురుతో ఆర్థిక లాభం



వెదురు మొక్కను పరిశీలిస్తున్న ఏపీఎం ముక్తేశ్వర్

కెరమెరి: వెదురు మొక్కల పెంపకంతో మహిళలు ఆర్థికంగా లాభపడవచ్చునని ఐకేపీ ఏపీఎం ముక్తేశ్వర్ అన్నారు. మండలంలోని చొపన్‌గూడ గ్రామంలో వెదురు నాటిన క్షేత్రాన్ని గురువారం పరిశీలించారు. ఒక్కసారి నాటిన మొక్క మూడు నాలుగేళ్లలో కాతకు వస్తుందన్నారు. మొక్కలు అందించిన వారే కొనుగోలు చేస్తారని మార్కెటింగ్‌కు ఎలాంటి ఢోకా లేదన్నారు. ఈ మొక్కలను త్రిపుర రాష్ట్రం నుంచి తెప్పించినట్లు తెలిపారు. ఆయన వెంట రైతులు, సీసీ దస్తగిరి ఉన్నారు.

18న వస్తు ప్రదర్శన

కాగజ్‌నగర్‌టౌన్: పర్యావరణ అనుకూల ఉత్పత్తులను ప్రోత్సహించేందుకు పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈనెల 18న ప్రత్యేక వస్తు ప్రదర్శనను నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ శ్రీదేవి గురువారం తెలిపారు. కేంద్ర పర్యావరణ అటవీ మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో చేపడుతున్న ఈ కార్యక్రమానికి తెలంగాణ నేషనల్ గ్రీన్ కార్ప్స్ స్పాన్సర్‌గా వ్యవహరిస్తున్నట్లు తెలిపారు. ఈ ప్రదర్శనలో విద్యార్థులు వివిధ రకాల పర్యావరణ హితమైన వస్తువులను స్థానికంగా దొరికే సహజసిద్ధమైన ముడి సరుకులతో తయారు చేసిన వస్తువులను ప్రదర్శిస్తారని పేర్కొన్నారు. ఉదయం 10 గంటలకు కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా ప్రారంభిస్తారని తెలిపారు.

కోనప్ప కృషితో సోమినికి ఆర్టీసీ బస్సు



సంతోషం వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు

బెజ్జూర్: మండలంలోని సోమిని గ్రామంలో దెబ్బతిన్న రోడ్లకు మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప ఆధ్వర్యంలో మరమ్మతు చేపట్టారు. దీంతో ఆ గ్రామానికి గురువారం ఆర్టీసీ బస్సు రావడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. కోనప్ప కృషితో తమ గ్రామానికి బస్సు వచ్చిందని, ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గుడుంబా స్వాధీనం

పెంచికల్‌పేట్: గుడుంబా విక్రయిస్తున్న ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై అనిల్‌కుమార్ తెలిపారు. తమకు అందిన పక్కా సమాచారంతో మండలంలోని పోతేపల్లి, బొంబాయిగూడ గ్రామాల్లో గురువారం ఉదయం దాడులు నిర్వహించారు. పోతేపల్లి గ్రామంలో 10 లీటర్ల గుడుంబా, బొంబాయిగూడలో 2 లీటర్ల గుడుంబా స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు. ఈ దాడుల్లో హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్, కానిస్టేబుల్స్ శ్యామ్, సురేష్ పాల్గొన్నారు.

పేకాడుతున్న ఐదుగురి అరెస్ట్

చింతలమానెపల్లి: మండలంలోని బాబాసాగర్ గ్రామంలో గురువారం పేకాట ఆడుతున్న ఐదుగురిని అరెస్టు చేసినట్లు టాస్క్‌ఫోర్స్ సీఐ రాణాప్రతాప్ తెలిపారు. పక్కా సమాచారంతో పేకాట స్థావరంపై దాడి చేసి ఐదుగురిని అదుపులో తీసుకోగా, ఒకరు పరారీలో ఉన్నారని పేర్కొన్నారు. వారి వద్ద నుంచి రూ. 16,080 నగదు, 52 పేకాట కార్డులను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ దాడిలో ఎస్సైలు కె.రాజు, మహమ్మద్, విజయ్, రమేశ్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు అవగాహన



అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

ఆసిఫాబాద్‌రూరల్: విద్యార్థులకు అన్ని రంగాల్లో అవగాహన కలిగి ఉండాలని ప్రిన్సిపాల్ శారద అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని గిరిజన మహిళా డిగ్రీ కళాశాలలో ప్రభుత్వ పరిశ్రమ శాఖ అధ్వర్యంలో ఎంటర్ ప్రెన్యూర్ ప్రోగ్రాంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యువత పరిశ్రమలు స్థాపించడానికి, వ్యాపారం చేయడానికి, ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ పథకాల గురించి వివరించారు. కార్యక్రమంలో విద్యార్థినులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

యూటర్న్ తీసుకునేదెలా..

- దేవులగూడ వద్ద మూసివేసిన అధికారులు
- ఇబ్బంది పడుతున్న గ్రామాల ప్రజలు
- వాహనదారులు, ప్రయాణికులకు తిప్పలు
- కి.మీ దూరం వెళ్లాల్సిన పరిస్థితి



దేవులగూడ వద్ద సిమెంట్ బిల్లలు అడ్డుగా పెట్టి మూసివేసిన యూటర్న్

రెబ్బెన: మండలం మీదుగా ఏర్పాటైన మంచిర్యాల-చంద్రపూర్ జాతీయరహదారితో మండల వాసులకు మెరుగైన రోడ్డు సౌకర్యం ఏర్పడింది. మంచిర్యాల, ఆసిఫాబాద్ వంటి ప్రాంతాలకు రాకపోకలు సాగించవచ్చు. అయితే నాలుగు వరుసల జాతీయ రహదారిపై ఎక్కడపడితే అక్కడ రోడ్డు దాటకుండా హైవే అధికారులు పలుచోట్ల యూటర్న్ ఏర్పాటు చేశారు. జాతీయ రహదారి పనుల్లో భాగంగా మండలంలోని దేవులగూడ వద్ద ఏర్పాటు చేసిన యూటర్న్‌ను రాత్రికి రాత్రే మూసివేయడంతో గ్రామాల ప్రజలు ఇబ్బంది పడుతున్నారు.

రాత్రికి రాత్రి యూటర్న్ బ్లాక్

నంబాల, నారాయణపూర్, గంగాపూర్, తుంగెడతో పాటు అనేక గ్రామాల ప్రజలు దేవులగూడ వద్ద యూటర్న్ ద్వారా రోడ్డును దాటేవారు. దేవులగూడ గ్రామస్తులు, గోలేటి విలేజ్ నుంచి వచ్చేవారికి ఈ మార్గం ఉపయోగకరంగా ఉండేది. కొన్నిరోజుల క్రితం రాత్రికి రాత్రి పెద్ద, పెద్ద సిమెంట్ బిళ్లలతో యూటర్న్‌ను మూసివేశారు. దాంతో వాహనదారులు కి.మీ దూరం వెళ్లి యూటర్న్ తీసుకోవాల్సి వస్తోంది. దేవులగూడ గ్రామస్తులు వాహనాలతో రోడ్డు దాటాలంటే 1.5 కిమీ దూరం వెళ్లి రావాల్సి వస్తోంది. నంబాల, నారాయణపూర్ వైపు వెళ్లే ఆర్టీసీ బస్సులు, లారీలకు ఇదే పరిస్థితి. అందరికి అందుబాటులో ఉన్న యూటర్న్‌ను ఎందుకు మూసివేశారో కూడా తెలియని పరిస్థితి. నేషనల్ హైవే అధికారులను ఈ విషయమై ప్రశ్నిస్తే ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అంటున్నారే తప్ప వారి నుంచి స్పష్టమైన సమాచారం రావడం లేదు.

మూసివేతతో ఇబ్బంది



దేవులగూడ వద్ద యూటర్న్ మూసివేయడంతో ఇబ్బంది పడాల్సి వస్తోంది. రెబ్బెనకు వెళ్లి తిరిగి ఇంటికి రావాలంటే సుమారు 6 కి.మీ దూరం వెళ్లి రావాల్సి వస్తోంది. యూటర్న్ ఉంటే కేవలం 2.5 కి.మీ దూరం ఉంటుంది. ప్రతిరోజు ఏదో ఒక పనిపై రెబ్బెనకు వెళ్లి రావాల్సి ఉంటుంది.

– బానోత్ రవి, దేవులగూడ

వెంటనే ప్రారంభించాలి



రెబ్బెన ఫ్లై ఓవర్ ఎక్కిన తర్వాత గోలేటి ఎక్స్‌రోడ్ వరకు సుమారు 4 కి.మీ దూరం ఎక్కడ యూటర్న్ లేదు. వాహనాలతో రోడ్డు దాటాలంటే అనవసరంగా కి.మీ దూరం ప్రయాణించాల్సి వస్తోంది. దేవులగూడ యూటర్న్‌ను వెంటనే ప్రారంభించాలి.

– బానోత్ శ్రీరామ్, దేవులగూడ

తీవ్రంగా ట్రాఫిక్ సమస్య

దేవులగూడ వద్ద యూటర్న్ మూసివేతతో మండల కేంద్రంలో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉంది. నంబాల, గంగాపూర్ వైపు ఉన్న సుమారు 12 గ్రామాల ప్రజలు గతంలో మంచిర్యాల, కాగజ్‌నగర్, ఆసిఫాబాద్ తదితర ప్రాంతాలకు దేవులగూడ మీదుగా రాకపోకలు సాగించేవారు. ప్రస్తుతం యూటర్న్ అందుబాటులో లేక గ్రామాల ప్రజలు మండల కేంద్రంలోని సర్వీస్ రోడ్డు గుండా రెబ్బెనకు వెళ్తున్నారు. ఓవైపు గంగాపూర్, నంబాల వైపు నుంచి వచ్చే వాహనాలు రెబ్బెన చేరుకోవాలంటే సుమారు 6 కి.మీ దూరం వెళ్లి రావాల్సి వస్తోంది. 300 మీటర్ల దూరంలో ఉన్న మండల కేంద్రానికి వచ్చేందుకు 6 కి.మీ దూరం ప్రయాణించలేక వాహనదారులు రాంగ్‌రూట్‌లో వెళ్తున్నారు. దాంతో సర్వీస్ రోడ్డు వెంట వాహనాల రద్దీతో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా మారుతోంది. మరోవైపు రాంగ్ రూట్‌లో వాహనాలు రాకపోకలు సాగిస్తుండటంతో బస్సులు, భారీ వాహనాలు వెళ్లాలంటే ఇబ్బందికరంగా మారుతోంది.

సమస్యల పరిష్కారానికి కృషి

- ఎమ్మెల్సీ దండె విఠల్



కాంగ్రెస్‌లో చేరిన అంకుశాపూర్ గ్రామస్తులు

కాగజ్‌నగర్‌రూరల్: గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్సీ దండె విఠల్ అన్నారు. మండలంలోని అంకుశాపూర్ గ్రామంలో గురువారం ఆయన పర్యటించారు. గ్రామంలో నెలకొన్న సమస్యలను గ్రామస్తులు ఎమ్మెల్సీ దృష్టికి తీసుకువచ్చారు. స్పందించి ఆయన.. సమస్యలను త్వరితగతిన పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని తెలిపారు. అనంతరం పలువురు గ్రామస్తులు ఎమ్మెల్సీ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ రాత్రే కమలాబాయి, లక్ష్మణ్, సాంబయ్య నారాయణ, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఆగని బియ్యం దందా

- యథేచ్ఛగా రవాణా
- వాహనాల్లో ఇతర ప్రాంతాలకు తరలింపు
- పట్టించుకోని అధికారులు

బెజ్జూర్: జిల్లాలో రేషన్ బియ్యం అక్రమ దందా ఆగడం లేదు. కొందరు వాహనాల్లో ఇతరప్రాంతాలకు యథేచ్ఛగా తరలిస్తున్నారు. కిలో బియ్యం రూ.12 నుంచి రూ.20 వరకు పెట్టి కొనుగోలు చేసి మహారాష్ట్రకు తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. బైక్‌లు, ఆటోలు, బొలెరో, ఐచర్ వాహనాల్లో రవాణా సాగిస్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి.

దొడ్డు బియ్యం లాగా..

గతంలో ప్రభుత్వం దొడ్డు బియ్యం పంపిణీ చేసేది. వాటిని తినడానికి లబ్ధిదారులు ఇబ్బందులకు గురయ్యేవారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతీ రేషన్ కార్డుదారులకు సన్న బియ్యం అందిస్తోంది. ఆ బియ్యంలో ఉన్న పోషక విలువలను లబ్ధిదారులకు అవగాహన కల్పించడంలో నిర్లక్ష్యం వహిస్తోంది. దీంతో అవి ప్లాస్టిక్ బియ్యంగా ప్రజలు అర్థం చేసుకుని తినడానికి వెనకాడి దళారులకు అమ్ముతున్నట్లుగా తెలుస్తోంది. జిల్లాలోని 333 పంచాయతీల్లో రేషన్ డీలర్లు, పంచాయతీ అధికారులతో కలిపి లబ్ధిదారులకు సమావేశమై సన్నబియ్యంపై ఉన్న అపోహలు తొలగించడం, అవగాహన కార్యక్రమాలు నిర్వహించాల్సి ఉంటుంది.

పీడీ యాక్ట్ పెట్టాలి

జిల్లాలో రేషన్ బియ్యాన్ని లబ్ధిదారుల వద్ద కొనుగోలు చేసి పక్క రాష్ట్రాలకు విక్రయాలు జరిపే వారిపై పీడీ యాక్ట్ కేసులు నమోదు చేయాలనే డిమాండ్ వ్యక్తమవుతోంది. రేషన్ డీలర్లు కూడా లబ్ధిదారుల వద్ద బియ్యం కొనుగోలు చేసి అధికారులకు దొరికితే వారిపై నామమాత్రపు చర్యలు కాకుండా కఠిన చర్యలు తీసుకుంటే అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసే అవకాశం లేదని ప్రజలు అంటున్నారు. ఈ విషయమై ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాసన్‌ను వివరణ కోరగా లబ్ధిదారులు సన్నబియ్యం అమ్మినట్లు తేలితే రేషన్ కార్డు రద్దు చేస్తామన్నారు. రేషన్ డీలర్లు కొనుగోలు చేసి పట్టుబడితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఇటీవల పట్టుబడిన బియ్యం

- బెజ్జూర్ మండల కేంద్రానికి చెందిన షేక్ తాజుద్దీన్ వద్ద 4 క్వింటాళ్ల రేషన్ బియ్యం ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు శ్రీనివాస్, రాజ్‌కుమార్ పట్టుకున్నారు.
- వాంకిడి మండలం గుర్లే హరిదాస్ ఇంట్లో నిల్వ ఉంచిన 10 క్వింటాళ్ల బియ్యం ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు పట్టుకుని కేసు నమోదు చేశారు.
- గత పదిరోజుల క్రితం కాగజ్‌నగర్ మండలం మోసం వద్ద టాస్క్‌ఫోర్స్ అధికారులు ఆటోలో తరలిస్తున్న 2.5 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేశారు.
- సిర్పూర్ మండలం పారిగాం రేషన్ డీలర్ బియ్యం కొనుగోలు చేశారని అధికారులు కేసు నమోదు చేశారు.
- సిర్పూర్ రైల్వేస్టేషన్‌లో అక్రమంగా తరలించేందుకు సిద్ధంగా ఉన్న 3 క్వింటాళ్ల బియ్యాన్ని పట్టుకున్నారు.

రేషన్ బియ్యం పట్టివేత



స్వాధీనం చేసుకున్న బైక్‌లు

సిర్పూర్(టి): కౌటాల మండలంలోని గ్రామాల నుంచి మహారాష్ట్రకు అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని బుధవారం రాత్రి ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు, సిర్పూర్(టి) పోలీసు అధికారులు సంయుక్తంగా పట్టుకున్నారు. ఎస్సై సురేష్ కథనం ప్రకారం.. కౌటాల మండలం కనికి గ్రామానికి చెందిన చాపిడే విలాస్, పార్డీ గ్రామానికి చెందిన తొర్రెమ్ బండు, కౌటాలకు చెందిన ఎల్ములే సంతోష్ బైక్‌ల ద్వారా రేషన్ బియ్యాన్ని మహారాష్ట్రకు తరలిస్తుండగా పట్టుకున్నారు. బియ్యాన్ని స్వాధీనం చేసుకుని పోలీసుస్టేషన్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు. నిందితులను విచారించగా, మహారాష్ట్రలోని పోడ్సా గ్రామానికి చెందిన బొమ్మకంటి అమూల్, భరత్ గ్యార్ అనే బియ్యం వ్యాపారులకు రేషన్ బియ్యం విక్రయిస్తున్నట్లు అంగీకరించారు. ఈమేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

పశువులకు గాలికుంటు టీకాలు



రేగులగూడలో టీకా కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా పశువైద్యాధికారి సురేష్



ఆసిఫాబాద్‌రూరల్: టీకాలు వేస్తున్న పశువైద్యుడు మురళీ కృష్ణ

కాగజ్‌నగర్‌టౌన్: పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేయాలని జిల్లా పశువైద్యాధికారి సురేష్ అన్నారు. మండలంలోని రేగులగూడలో గురువారం నిర్వహించిన గాలికుంటు వ్యాధి టీకాల కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గాలికుంటు వ్యాధి సోకిన పశువులు తీవ్రమైన జ్వరం బారినపడి జీవాలు నీరసంగా ఉంటాయన్నారు. తొలుత నోటిలో చిన్న చిన్న పొక్కులు లేచి పెద్దవి అయ్యి పగిలిపోతాయన్నారు. పాలు తాగే దూడలో మరణాలు సంభవిస్తాయన్నారు. పశువుల యజమానులు నిర్లక్ష్యం వహించకుండా పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలు వేయించాలని సూచించారు. మండల పశువైద్యాధికారి పరిమళ, గోపాలమిత్ర రమేశ్, పశువుల యజమానులు ఉన్నారు.

ఆసిఫాబాద్‌రూరల్: గాలికుంటు నివారణ టీకాలను సద్వినియోగం చేసుకోవాలని మండల పశువైద్యుడు మురళీకృష్ణ కోరారు. మండలంలోని గొల్లగూడ, తేలివాడలో గురువారం పశువులకు గాలికుంటు టీకాలు వేశారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది వినోద్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

సిర్పూర్(టి): మండలంలోని అచ్చెల్లి పంచాయతీలో గురువారం పశువైద్యాధికారి విజయ్ ఆధ్వర్యంలో పశువులకు టీకాలు వేశారు. 483 ఆవులు, ఎడ్లకు, 81 గేదెలకు టీకాలు వేసినట్లు వైద్యాధికారి తెలిపారు.

కెరమెరి: పశువులకు గాలికుంటు నివారణ టీకా వేయడం తప్పనిసరి అని పశువైద్యాధికారి సురేశ్ పేర్కొన్నారు. మండలంలోని గోయగాం గ్రామంలో గురువారం పశువులకు గాలికుంటు నివారణ టీకాలు ఇచ్చారు. గోయగాంలో 508 ఆవులు, 57 గేదెలకు టీకాలు వేసినట్లు తెలిపారు. ఆయన వెంట సిబ్బంది రాజకుమార్, చంద్రకుమార్ తదితరులు ఉన్నారు.

విద్యార్థులు శాస్త్రవేత్తలుగా ఎదగాలి



విద్యార్థులకు పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలు అందజేస్తున్న తహసీల్దార్ మధుకర్

కాగజ్‌నగర్‌టౌన్: విద్యార్థులు శాస్త్రవేత్తలుగా ఎదగాలని తహసీల్దార్ మధుకర్ అన్నారు. కాగజ్‌నగర్ నవోదయ విద్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విజ్ఞాన జ్యోతి కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థుల్లో సైన్స్‌పై ఆసక్తి పెంచి వారిలో ప్రతిభను వెలికితీసేందుకు విజ్ఞాన జ్యోతి కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టిందన్నారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాన్ని వెలికి తీయవచ్చన్నారు. అనంతరం ప్రిన్సిపాల్ కృష్ణ మాట్లాడుతూ 10, 11వ తరగతి విద్యార్థులను ఎంపిక చేసి వారికి ఐఐటీ, నీట్ తదితర పోటీ పరీక్షలకు ఉపయోగపడే పుస్తకాలు అందజేసినట్లు తెలిపారు. కేజీబీవీ ప్రధానోపాధ్యాయురాలు శ్రీదేవి, శ్రీరీష, ఐలయ్య, తిరుపతమ్మ, విద్యార్థులు పాల్గొన్నారు.

వ్యవసాయ కార్మికులకు సమగ్ర చట్టం చేయాలి

కాగజ్‌నగర్‌టౌన్: వ్యవసాయ కార్మికులకు కేంద్రప్రభుత్వం సమగ్ర చట్టం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కన్వీనర్ ముంజం ఆనంద్‌కుమార్ డిమాండ్ చేశారు. కాగజ్‌నగర్‌లో గురువారం ఆయన మాట్లాడారు. వ్యవసాయ కార్మికులకు తినడానికి తిండి, ఉండటానికి ఇల్లు కట్టుకోవడానికి బట్ట కరువైందన్నారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రభుత్వం భూమి లేని వ్యవసాయ కార్మికులకు ఏడాదికి రూ.12 వేలు ఇస్తామని హామీ ఇచ్చిందని ఇప్పటివరకు నెరవేర్చలేదన్నారు. అర్హులందరికీ ఇళ్లు మంజూరు చేయడం లేదన్నారు. కార్మికులకు ఉచిత విద్య, వైద్యం, అందించాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న ఉపాధి హామీ కూలీల వేతనాలు విడుదల చేయాలన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేయాలి



సిర్పూర్(టి): పరిశీలిస్తున్న ఎంపీడీవో సత్యనారాయణ

కెరమెరి: గ్రామాల్లో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను త్వరగా పూర్తిచేయాలని ఎంపీడీవో అంజద్‌పాషా అన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో కార్యదర్శులు, ఉపాధి టీఏలతో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. పీఎం జన్‌మన్ కింద మంజూరైన గృహాలు, పంచాయతీ భవనాల నిర్మాణం, పారిశుద్ధ్యం, ఉపాధి కూలీల ఈకేవైసీ, పనుల జాతర పూర్తి చేయడం, భవన్ క్యాప్చర్ తదితర అంశాలపై సమీక్ష జరిపారు. కార్యక్రమంలో ఈజీఎస్ ఏపీవో మల్లయ్య, ఈసీ అక్యా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

సిర్పూర్(టి): ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల్లో వేగం పెంచాలని ఎంపీడీవో సత్యనారాయణ అన్నారు. మండలంలోని వెంకట్రావ్‌పేట్ పంచాయతీలో ఇళ్ల నిర్మాణాలను గురువారం పరిశీలించారు. లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలు స్లాబ్ లెవల్ వరకు పూర్తి చేసుకుని బిల్లులు పొందాలని సూచించారు. అనంతరం గ్రామంలో పర్యటించి సమస్యలను పరిష్కరించారు. పంచాయతీ కార్యదర్శి సందీప్ ఉన్నారు.

డిజిటల్ తరగతులు ప్రారంభం



ప్రారంభిస్తున్న అధికారులు

ఆసిఫాబాద్‌రూరల్: విద్యార్థుల సంక్షేమం కోసం హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు, సీవైడీఏ కృషి చేస్తోందని హెచ్‌డీఎఫ్ సౌత్ రీజనల్ మేనేజర్ అమిత్ నాందేవ్ అన్నారు. మండలంలోని మోతుగూడ, రౌట సంకెపల్లి, బాబాపూర్, మానిక్‌గూడ, వావుదాం ప్రభుత్వ పాఠశాలల్లో సీవైడీఏ, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు సహకారం ద్వారా గురువారం డిజిటల్ తరగతులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు నూతన పరిజ్ఞానంతో కూడిన విద్యనందించాలన్నారు. ఒక్కో పాఠశాలకు రూ.3.50 లక్షలతో డిజిటల్ తరగతి ఏర్పాటు చేసినట్లు తెలిపారు. దాంతోపాటు రూ.1.20 లక్షలతో ల్యాబ్, రూ.80 వేలతో తాగునీటి కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సీవైడీఏ పీవో ప్రవీణ్ జాదవ్, ప్రాజెక్టు మేనేజర్ నరేశ్, సిబ్బంది సోమ్‌నాథ్, బాలేశ్వర్, రవీందర్, ప్రవణ్ కుమార్, నాయకుడు వినోద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పోషకాహారంతోనే ఆరోగ్యం



మాట్లాడుతున్న సీడీపీవో విజయలక్ష్మి

పెంచికల్‌పేట్: ప్రతి ఒక్కరూ పోషకాహారం తీసుకోవడంతోనే ఆరోగ్యంగా ఉంటారని సీడీపీవో విజయలక్ష్మి తెలిపారు. మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం పోషణమాసం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీవో మాట్లాడుతూ గర్భిణులు, కిశోర బాలికలు, చిన్నారులు పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. ఏసీడీపీవో హేమలత, సూపర్‌వైజర్లు హసీనా, కరుణ రెడ్డి, అంగన్‌వాడీ టీచర్లు, ఆశ కార్యకర్తలు ఉన్నారు.

నిరుపయోగంగా సీసీ కెమెరాలు



దహెగాం: మండల కేంద్రంలో పలు ప్రధాన కూడళ్లలో మూడేళ్ల క్రితం ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు నిరుపయోగంగా మారాయి. వ్యాపారుల సహకారంతో పోలీసులు వీటిని ఏర్పాటు చేశారు. మొదట్లో ఏడాది పాటు పనిచేయగా, ఆ తర్వాత పనిచేయకుండా ఉన్నాయి. ఏదైనా సంఘటన జరిగితే వారిని పట్టుకోవడం పోలీసులకు కష్టంగానే మారుతుందని పలువురు పేర్కొంటున్నారు. సీసీ కెమెరాలను వినియోగంలోకి తీసుకురావాలని స్థానికులు జిల్లా పోలీసు అధికారులను కోరుతున్నారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ల అందజేత

ఆసిఫాబాద్: మొబైల్ సెల్‌ఫోన్లు పోగొట్టుకున్న పలువురికి గురువారం సీఐ బాలాజీ ప్రసాద్ అందజేశారు. జిల్లా కేంద్రానికి చెందిన పలువురు సెల్‌ఫోన్లు పోగొట్టుకోవడంతో వారి ఫిర్యాదును సీఈఐఆర్ పోర్టల్ ద్వారా నమోదు చేశారు. దర్యాప్తులో ఆధునిక సాంకేతికతతో అదృశ్యమైన సెల్‌ఫోన్లను పోలీసులు గుర్తించినట్లు సీఐ తెలిపారు.

ఉపాధి హామీ పనులు గుర్తించాలి



మాట్లాడుతున్న ఎంపీడీవో కోట ప్రసాద్

కౌటాల: గ్రామాల్లో ఉపాధి హామీ పనులను గుర్తించాలని ఎంపీడీవో కోట ప్రసాద్ అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బందితో గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ కూలీల ఈ కేవైసీ ప్రక్రియను వేగవంతం చేసి పూర్తి చేయాలన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు గడువులోగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టాలన్నారు. సమావేశంలో ఎంపీవో మహేందర్‌రెడ్డి, ఏపీవో పూర్ణిమ, ఈసీ సంతోష్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఆర్టీసీ అభివృద్ధిలో ఉద్యోగుల పాత్ర కీలకం



పురస్కారాలు పొందిన ఉద్యోగులతో అధికారులు

ఆదిలాబాద్: ఆర్టీసీ అభివృద్ధిలో ఉద్యోగుల పాత్ర కీలకమని కరీంనగర్ జోనల్ వర్క్‌షాప్ వర్క్స్ మేనేజర్ ఎస్.ప్రణీత్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఆదిలాబాద్ డిపోలో గురువారం ఏర్పాటు చేసిన ప్రగతి చక్ర పురస్కారాల ప్రధానోత్సవ కార్యక్రమంలో పాల్గొని ఉద్యోగులకు అవార్డులు అందించారు. సంస్థ ప్రగతికి ఉద్యోగులు ఎంతగానో కృషి చేస్తున్నారన్నారు. వారి కృషిని గుర్తిస్తూ ప్రగతి చక్ర పురస్కారాలు అందిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ ఆర్ఎంలు శ్రీహర్ష, రామయ్య, డిపో మేనేజర్ ప్రతిమారెడ్డి, శ్రీకర్ పాల్గొన్నారు.